క్లుప్తంగా

గుంతలను పూడ్చండి మహాప్రభో..



మల్లానూరులో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కుప్పం రూరల్ : కుప్పం మండలం మల్లానూరులో రోడ్లు గుంతలమయయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా మండల పరిధిలోని అనేక గ్రామాలతోపాటు తమిళనాడులోని తిరుపత్తూరుకు పెద్ద ఎత్తున వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మల్లానూరులో రోడ్డుపై అడుగుకోగుంత పడడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలుస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లిపాలే శిశువుకు శ్రేష్టం



మాట్లాడుతున్న సీడీపీవో వాణిశ్రీదేవి

సదుం: తల్లిపాలే శిశువుకు శ్రేష్టమని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవి తెలిపారు. మండలంలోని బూరగమందలో గురువారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యం, అనుబంధ ఆహారంపై అవగాహన కల్పించారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని సూచించారు.కార్యక్రమంలో డాక్టరు చరణ్, అంగన్‌వాడీ సూపర్‌వైజరు మల్లీశ్వరి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దపంజాణి: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పలమనేరు ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ టీచర్లు, వీవో లీడర్లకు రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సరైన పోషకాలు అందకపోతే రక్తహీనత కలుగుతుందన్నారు. ఎంపీడీవో బాలాజి, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, ఏపీఎం నీరజ, సూపర్‌వైజర్లు లత, కల్పన పాల్గొన్నారు.

బాపూజీ పార్కులో మాస్ క్లీనింగ్ డ్రైవ్

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛాతాహి సేవా–2025లో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయ సమీపంలోని బాపూజీ పార్కులో మాస్ క్లీనింగ్ చేపట్టారు. చెత్తాచెదారం శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించారు. కమిషనర్ రమణారెడ్డి, మెప్మా నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తిరుమల పాల డెయిరీ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. డెయిరీ మేనేజర్ పత్తినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పుంగమ్మ చెరువు కట్టపై పారిశుద్ధ్య పనులు

పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని పుంగమ్మ చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్‌పై గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతాహి సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బైరెడ్డిపల్లిలో ఆగని బస్సులు

ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయమని చెప్పే ఆర్టీసీ అధికారులు ఆచరణలో విఫలమవుతున్నారు. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో పలు బస్సు సర్వీసులు ఆపకపోయినా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా విజయవాడ, హైదరాబాద్ నుంచి వచ్చే వోల్వోలాంటి బస్సులు ఆగుతున్నా.. తిరుపతి డిపోకు చెందిన బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

- ముఖ్యంగా తిరుపతి డిపో బస్సులు ఆగని వైనం
- రాత్రుల్లో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- ఎమ్మెల్యే స్పందించాలంటున్న జనం



బైరెడ్డిపల్లి మీదుగా వెళుతున్న పళని బస్సు

పలమనేరు: హైదరాబాద్, విజయవాడ నుంచి వచ్చే వోల్వోలాంటి బస్సులకు సైతం మండల కేంద్రమైన బైరెడ్డిపల్లిలో స్టాపింగ్ ఉంది. తిరుపతి డిపో నుంచి తమిళనాడులోని పళనికి వెళ్లే బస్సులకు స్టాపింగ్ లేదు. ఎవరైనా పొరబాటున ఎక్కినా 20 కిలోమీటర్ల దూరంలోని వీ.కోటలో దిగాల్సిందే. వి.కోట టికెట్ తీసుకున్నా బైరెడ్డిపల్లిలో ఆపాలని అడిగితే చార్ట్‌లో స్టాపింగ్ లేనందున బస్సును ఆపే ప్రసక్తే లేదని కండక్టర్లు తెగేసి చెబుతున్నారు. బైరెడ్డిపల్లిలో పళని బస్సు ఆపాలని స్థానికులు ఆరేళ్లగా అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. పళని సుబ్రమణ్యస్వామిని దర్శించుకునే భాగ్యం మాకు లేదా అని బైరెడ్డిపల్లి మండల వాసులు వాపోతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి....

తిరుపతి డిపోకు చెందిన పళని బస్సు రోజు రాత్రి 8.30 గంటలకు తిరుపతిలో బయలుదేరుతుంది. చిత్తూరుకు 10 గంటలకు, పలమనేరుకు 11 గంటలకు, వి.కోటకు 12 గంటలకు, కుప్పానికి ఒంటి గంటకు, తమిళనాడులోని క్రిష్ణగిరికి 2 గంటలకు, ధర్మపురికి 3 గంటలకు, ఈరోడ్‌కు మరుసటి రోజు ఉదయం 6 గంటలకు, ఉదయం 7.30 గంటలకు పళని చేరుకుంటుంది. రాత్రి పూట చిత్తూరు, పలమనేరు నుంచి కుప్పం వైపున్న ప్రాంతాలకు అసలే బస్సులు వుండవు. వేలూరు సీఎంసీకి వెళ్లిన వారు బైరెడ్డిపల్లికి రావాలంటే చిత్తూరు నుంచి ఈ బస్సు అక్కడ స్టాపింగ్ లేదు. ఇక పలమనేరులో సమయం తప్పి రాత్రి పది గంటల నుంచి బైరెడ్డిపల్లికి వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. తాము వి.కోట టికెట్ తీసుకుంటాము.. రిక్వెస్ట్ స్టాఫ్ ఇవ్వాలని బతిమలాడినా కండక్టర్, డ్రైవర్లు రూల్స్ అంటే రూల్సేనని వినడం లేదని బైరెడ్డిపల్లికి చెందిన కరుణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక పళని నుంచి తిరుపతికి వచ్చే మరో బస్సు బైరెడ్డిపల్లికి ఉదయం 5 గంటలకు తొలి సర్వీసుగా వస్తుంది. అదే సమయానికి తిరుపతిలోని ఆస్పత్రులు, కాలేజీలకు వెళ్లేందుకు రోగులు, విద్యార్థులు, ఇతర పనుల కోసం వెళ్లేవారు అక్కడున్నా బస్సు స్టాపింగ్ లేనందున బస్సు ఖాళీ ఉన్నా బైరెడ్డిపల్లిలో ఆపడంలేదు. దీంతో బైరెడ్డిపల్లి మండల వాసులకు రాత్రుల్లోనూ, ఉదయం పూట ఇబ్బందులు తప్పడంలేదు.

మండల కేంద్రంలో స్టాపింగ్ లేకపోవడమేమిటో..

పళని బస్సును ప్రారంభించినప్పుడు సమయాన్ని ఆదా చేసేందుకు చార్ట్‌లో బైరెడ్డిపల్లి స్టేజీ లేకుండా చేశారు. ఇన్నేళ్లు అవుతున్నా ఆర్టీసీ అధికారులు అప్‌డేట్ చేయలేదు. ఇదే మార్గంలో ఇంతకు మించిన ఏసీ వోల్వో బస్సులకు సైతం స్టాపింగ్ వున్నా పళని బస్సుకు స్టాపింగ్ లేకపోవడమేమిటిరా బాబు అని మండలవాసులు పెదవి విరుస్తున్నారు. దీనిపై ఆర్టీసీ ఆర్‌ఎం అయినా స్పందించాలని జనం విన్నవిస్తున్నారు. ఆ బస్సు బైరెడ్డిపల్లిలో ఆపకుంటే మా ఊర్లో వెళ్లకుండా అడ్డుకుంటామని కొందరు యువకులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం కొసమెరుపు.

సూర్యప్రభ వాహనంపై శ్రీరాముడి విహారం

బైరెడ్డిపల్లె : మండలంలోని తీర్థం గ్రామంలో వున్న శ్రీరాముడి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. గ్రామస్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రమేష్ ఆయార్, మురళీధర్‌రావు, వేద వ్యాస్, మునికృష్ణ, రాజేష్ ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే బైరెడ్డిపల్లె వాసవీ కన్యకాపరమేశ్వరి, సల్లాపురెమ్మ, బాటగంగమ్మ ఆలయాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించారు.



తీర్థం గ్రామంలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీరామచంద్రస్వామి

పెద్దిరెడ్డి పర్యటనను విజయవంతం చేద్దాం



నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన నాగభూషణరెడ్డి, తదితరులు

చౌడేపల్లె: దసరా సందర్భంగా బోయకొండ గంగమ్మకు సోమవారం మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ పిలుపునిచ్చారు. వారు గురువారం చౌడేపల్లెలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. స్వాగత ఏర్పాట్లపై చర్చించారు. చౌడేపల్లె సరిహద్దుల గ్రామాల నుంచి బోయకొండ ఆలయం వరకు పెద్దిరెడ్డికి స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వాగత హోర్డింగులు, జన సమీకరణపై చర్చించారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సింగిల్ విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ డైరెక్టర్లు నాగరాజ, శంకరప్ప, రమేష్‌బాబు, మాజీ ఎంపీటీసీ పద్మనాభరెడ్డి, కోఆప్షన్ మెంబరు సాధిక్‌బాషా, ప్రభాకర్ యాదవ్ తితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు నివాళి



హరినాథరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి



రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని గొంగివారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త హరినాథరెడ్డి (70) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి గురువారం గ్రామానికి చేరుకున్నారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సోమల మండలం గట్టువారిపల్లెకు చెందిన పార్టీ కార్యకర్త రామయ్య మృతి చెందారు. ఆయన మృతదేహంపై పూలమాల నివాళులర్పించారు. ఆయన వెంట కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, రమేష్ రెడ్డి, పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, అన్నారెడ్డి, మాజీ సర్పంచ్ హరినాథ్,తులసీరామ్, పాచాసాబ్ పాల్గొన్నారు.

నేడు, రేపు శిక్షణా తరగతులు

పెద్దపంజాణి: ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక 2024–25కు సంబంధించి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు శుక్ర, శనివారాలు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బాలాజి తెలిపారు. ఇందులో గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఆదాయ వనరుల పెంపు తదితరాలపై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.

పులిచెర్లలో...

పులిచెర్ల(కల్లూరు) : మండల కేంద్రమైన పులిచెర్లలో శుక్ర, శనివారాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో మునిరాజ తెలిపారు. అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పేద మహిళకు న్యాయం చేయాలని వినతి

పలమనేరు: ఎన్నో ఏళ్ల క్రితం డీకేటీ పట్టా ఇచ్చిన మహిళ భూమిని కూటమి నేతల ఒత్తిడితో అధికారులు పరిశ్రమల కోసమని తీసుకున్నారని, ఆమెకు న్యాయం చేయాలని రాష్ట్ర వాల్మీకి సంఘం నేతలు డిమాండ్ చేశారు. వారు గురువారం ఆర్డీవో భవానికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి ఆ భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం జాతీయ రహదారికి దగ్గరలో వుండడంతో దీనిపై కన్నేసిన అధికార పార్టీ నేతలు ఏపీఐఐసీకి కట్టబెట్టారని తెలిపారు. ఆమెకు న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దార్ ఇన్బనాథన్ వివరణ ఇస్తూ బాధితురాలి సర్వే నంబరు ఆధారంగా సర్వే చేసి భూమి ఇస్తామన్నారు. ఇప్పుడు ఏపీఐఐసీకి కేటాయించిన సర్వే నంబరు వేరని తెలిపారు.



ఆర్డీవోతో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నేతలు

స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

బైరెడ్డిపల్లె : మండలంలో స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డీపీవో సుధాకర్‌రావు ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వే సమగ్రంగా చేపట్టి వెక్టరైజేషన్‌ను పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. అనంతరం బైరెడ్డిపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో ఆనంద బాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, డీఆర్‌పీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వి.కోట: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు తెలిపారు. పట్టణంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా, స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై సర్పంచ్ పిఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఈవో నరేష్, పంచాయతీ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు

కార్మికులకు వైద్యపరీక్షలు

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులకు గురువారం తూర్పుమొగసాలలో వున్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ రంజిత బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



పులిచెర్ల మండలం పాపిరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు) : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం పాపిరెడ్డిగారిపల్లెలో వైద్య శిబిరం నిర్వహించినట్టు పులిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మహిళలకు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో అన్ని రకాల పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పురుషోత్తం, ప్రమీల, శ్రీదేవి, చంద్రయ్య పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

పెద్దపంజాణి: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కింద మహిళల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేసినట్టు పెద్దపంజాణి, రాయలపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు మురళి, మాధవి తెలిపారు. రాయలపేట, బట్టందొడ్డి గ్రామాల్లో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. గైనకాలజిస్టు మీనాక్షి, డెంటల్ స్పెషలిస్టు దేవరాజ్, ఈఎన్‌టీ స్పెషలిస్టు యుగంధర్, చిన్నపిల్లల వైద్యులు ప్రవీణ్ మహిళలు, చిన్న పిల్లలకు పలు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని తహసీల్దార్ హనుమంతు పరిశీలించారు.

సదుంలో..

సదుం: మండలంలోని బూరగమందలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో రాధారాణి పరిశీలించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పెద్దపంజాణి : రోగులను పరీక్షిస్తున్న ఈఎన్‌టీ వైద్య నిపుణులు యుగంధర్



సదుంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఉచితంగా అంబులెన్స్ సేవలు

పలమనేరు: పలమనేరు పట్టణ వాసులకు లయన్స్ క్లబ్ ద్వారా ఉచితంగా అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు నిర్వాహకులు సత్యప్రకాష్ తెలిపారు.అవసరమైన వారు వాహనానికి డీజిల్ పోసుకుని, డ్రైవర్‌కు బత్తా చెల్లించి వినియోగించుకోవాలని సూచించారు. అందులో ఆక్సిజన్ సౌకర్యం కూడా వుందన్నారు.

టి.వడ్డూరులో తీరిన తాగునీటి సమస్య

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో తాగునీటి సమస్య తీరింది. ఇక్కడ 1000కి పైగా కుటుంబాలు వున్నాయి. తాగునీటి సమస్య నెలకొనడంతో సర్పంచ్ మునస్వామి జెడ్పీ నిధులు రూ.2.75లక్షలతో బోరు వేశారు. గురువారం మోటారును బిగించి నీటిని సరఫరా చేశారు. తాగునీటి సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

పాహిమాం.. కాత్యాయని

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలో వెలసిన కాళికాదేవి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పలమనేరుకు చెందిన డాక్టర్ సరిత, సతీష్, హిమసిద్ధార్థ్, సాయంత్రం శంకరాచారి, శ్రీనివాసులు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గాయత్రీదేవి అవతారంలో మలాలమ్మ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వున్న మలాలమ్మ (చాముండేశ్వరి దేవి) అమ్మవారు గురువారం గాయత్రీదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఆలయ ధర్మకర్త చంద్రప్ప ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

గాయత్రీదేవిగా ముత్యాలమ్మ

రొంపిచెర్ల: దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం రొంపిచెర్లలో వెలసిన ముత్యాలమ్మ గాయత్రీదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఉభయదారులుగా గెర్లపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

అన్నపూర్ణాదేవిగా కన్యకా పరమేశ్వరి

పులిచెర్ల(కల్లూరు) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్లూరులో గురువారం కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయదారులుగా ముప్వల నరశింహులుశెట్టి, డి.సతీష్, ఎం.సునీల్ గుప్త కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

సదుంలో

సదుం : మండలంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెడ్డివారిపల్లె చామంతుల ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన పూజల్లో సర్పంచ్ హనుమంత రెడ్డి పాల్గొన్నారు. జాంద్రపేట చౌడేశ్వరీదేవి, పచ్చార్లమాకులపల్లె గంగాపురెమ్మ ఆలయాల్లో అమ్మవారు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. సదుం సదుమమ్మ ఆలయంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో నంది వాహన సేవ చేపట్టారు.

ప్రత్యేక అలంకారంలో అమ్మవార్లు

పుంగనూరు: పట్టణంలోని భోగనంజుడేశ్వర స్వామి ఆలయంలో పార్వతిదేవి కాత్యాయినిగా, విరూపాక్షి మారెమ్మను జీడిపప్పుతో అలంకరించారు. చదళ్లలో చౌడేశ్వరిదేవి కంచికామాక్షి దేవిగా భక్తులను అనుగ్రహించారు.

కాత్యాయనీదేవిగా దుర్గామాత

వి.కోట: పట్టణంలో వెలసిన దుర్గామాత గురువారం కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఊంజల్ సేవ చేపట్టారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు.



పెద్దపంజాణి : కాత్యాయనిదేవి అలంకారంలో కాళికాదేవి

కాత్యాయినిదేవీగా కనకదుర్గమ్మ

పలమనేరు: పట్టణంలోని పాతపేట కనకదుర్గమ్మ గురువారం కాత్యాయినిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సత్య గంగమ్మకు ప్రత్యేక అలంకరణ చేశారు.



గంగవరం : గాయత్రీదేవి అవతారంలో మలాలమ్మ



రొంపిచెర్లలో గాయత్రిదేవిగా కొలువుతీరిన ముత్యాలమ్మ



కల్లూరులో అన్నపూర్ణాదేవిగా వాసవీ కన్యకా పరమేశ్వరి



పుంగనూరు: కాత్యాయని అమ్మవారిగా పార్వతిదేవి



పుంగనూరు : విరూపాక్షి మారెమ్మకు జీడిపప్పుతో అలంకరణ



పలమనేరు : ప్రత్యేక అలంకరణలో కనక దుర్గమ్మ